క్లుప్తంగా

కలెక్టరేట్‌లో స్వచ్ఛతా హీ సేవ



అల్లూరి విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న దృశ్యం

ఏలూరు(మెట్రో) : స్వభావ స్వచ్ఛత సంస్కార స్వచ్ఛత ఇతివృత్తంగా స్వచ్ఛతా హీ సేవా–2024 ప్రతి ప్రభుత్వ కార్యాలయంలో చేపట్టి పరిశుభ్రత, ఆహ్లాదకరమైన వాతావరణాన్ని సృష్టించుకోవాలని జిల్లా రెవెన్యూ అధికారి వి.విశ్వేశ్వరరావు సూచించారు. శనివారం స్థానిక కలెక్టరేట్ ఆవరణంలో అల్లూరి సీతారామరాజు విగ్రహం వద్ద స్వచ్ఛతా హీ సేవా కార్యక్రమం కలెక్టరేట్ సిబ్బందితో ఆయన చేపట్టారు. ఇంటి పరిశుభ్రతలే కాకుండా పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని, అదే విధంగా ప్రభుత్వ కార్యాలయాల్లో కూడా పరిశుభ్రతతో నిండివుండాలని అన్నారు. కలెక్టర్ ఆదేశాల మేరకు ఈ కార్యక్రమం నిర్వహించామని చెప్పారు. ఈ సందర్భంగా అల్లూరి సీతారామరాజు విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ భాస్కర్, కలెక్టరేట్ కార్యాలయ ఏఓ నాంచారయ్య, పరిపాలనా విభాగం సూపరింటెండెంట్లు, కలెక్టరేట్ సిబ్బంది పాల్గొన్నారు.

చిత్రలేఖన పోటీలు



చిత్రలేఖన పోటీలో పాల్గొన్న విద్యార్థులు

ఏలూరు రూరల్ : చాటపర్రు గ్రంథాలయంలో నిర్వాహకురాలు కె వాసుకి పర్యవేక్షణలో చిత్రలేఖన పోటీ నిర్వహించారు. జెడ్పీ స్కూల్‌తో పాటు పలు ప్రైవేటు పాఠశాల విద్యార్థులు పాల్గొన్నారు. విజేతలకు వారోత్సవాల ముగింపు రోజున బహుమతులు అందిస్తామని వాసుకి తెలిపారు.

18న ఎస్ఎఫ్ఐ మహాధర్నా

ఏలూరు (ఆర్ఆర్‌పేట): విద్యారంగ సమస్యలు పరిష్కారం కోసం ఈనెల 18న విజయవాడలో ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో నిర్వహించే మహాధర్నాను విజయవంతం చేయాలని ఆ సంఘం రాష్ట్ర కమిటీ సభ్యుడు కె.లెనిన్ కోరారు. శనివారం ఏలూరు ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఈ కార్యక్రమ పోస్టర్‌ను విడుదల చేశారు. డిగ్రీ, ఇంజినీరింగ్, బీఫార్మసీ, సీ ఫార్మసీ వంటి ఉన్నతమైన విద్యలో మూడు విడతల వరకు వసతి దీవెన, విద్యా దీవెన రూ.3,480 కోట్లు పెండింగ్‌లో ఉన్నాయని, వాటి సాధన కోసం ధర్నాకు పిలుపునిచ్చినట్టు లెనిన్ తెలిపారు. తాము అధికారంలోకొస్తే ప్రభుత్వ జూనియర్ కళాశాలలో మధ్యాహ్నం భోజనం పథకాన్ని పునఃప్రారంభిస్తామని యువగళం పాదయాత్రలో నారా లోకేష్ ఇచ్చిన హామీని అమలు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ నాయకులు వై. అభిలాష్ తదితరులు పాల్గొన్నారు.

లాపరోస్కోపిక్ సర్జరీతో కణితి తొలగింపు



ఏలూరు రూరల్ : అడ్వాన్స్‌డ్ లాపరోస్కోపిక్ విధానంతో అరుదైన చికిత్స చేశామని ఆశ్రం ఆసుపత్రి సీఈఓ కె.హనుమంతురావు ఓ ప్రకటనలో తెలిపారు. మధుమేహంతో బాధపడుతూ ఆశ్రంలో ఆసుపత్రిలో చేరిన కర్ణాటకకు చెందిన సత్యవతి అనే మహిళను సర్జికల్ గ్యాస్ట్రో విభాగం డాక్టర్ టీవీ కృష్ణనంధన్ పరీక్షించి పొట్ట భాగంలో కణితి ఉన్నట్టు గుర్తించారని పేర్కొన్నారు. ఎలాంటి కోత లేకుండా లాపరోస్కోపిక్‌తో స్కిన్ ప్రిజర్వింగ్ డిస్టల్ ఫ్యాంక్రియాటెక్టమి విధానంలో సర్జరీ ద్వారా ఆరు అంగుళాల పొడవు గల కణితిని వైద్యులు తొలిగించారని తెలిపారు. రోగి రెండో రోజు కోలుకోవడంతో పాటు ఆహారం తీసుకుందని వివరించారు. మూడో రోజు డిశ్చార్జ్ అయ్యిందని పేర్కొన్నారు.

పార్కింగ్ పరేషాన్

- ఏలూరు నగరంలో పెరిగిన ట్రాఫిక్
- రోడ్లపైనే వాహనాల పార్కింగ్‌తో కష్టాలు

ఏలూరు టౌన్: రోజురోజుకూ అభివృద్ధి చెందుతోన్న ఏలూరు నగరంలో వాహనదారులకు పార్కింగ్ కష్టాలు ఎదురవుతున్నాయి. మోటారు సైకిళ్లు, కార్లు నిలిపేందుకు పార్కింగ్ స్థలాలు లేకపోగా పోలీసు ఆంక్షలతో వాహనచోదకులు తీవ్ర అసౌకర్యానికి గురవుతున్నారు. పార్కింగ్ స్థలాలు ఏర్పాటు చేయకుండా, నిబంధనలకు విరుద్ధంగా షాపింగ్ కాంప్లెక్స్‌ల నిర్మాణం, రోడ్డు ఆక్రమణలతో సమస్య మరింత జఠిలమవుతోంది. వాహనాల పార్కింగ్‌కు స్థలం ఏర్పాటు చేసే దిశగా నగర పాలక, పోలీసు, రెవెన్యూ, ఆర్అండ్‌బీ అధికారులు చర్యలు చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు.

పార్కింగ్ స్థలాలు లేక పాట్లు

ఏలూరు కార్పొరేషన్‌లో ఏడు పంచాయతీలు ఇటీవల విలీనమయ్యాయి. జిల్లా కేంద్రం కావటంతో నిత్యం ఏలూరుకు వేలాది మంది జిల్లా వ్యాప్తంగా ఆయా ప్రాంతాల నుంచి వస్తూ ఉంటారు. ఏలూరు నగరంలో 3.25 లక్షల మంది జనాభాకు తోడు పరిసర ప్రాంతాల నుంచి వచ్చే వారితో ప్రతి రోజూ నగరంలో 35 వేలకు పైగా మోటారు సైకిళ్లు, వేలాది కార్లు, ఆటోలు రోడ్లపై పరుగులు పెడుతూ ఉంటాయి. ఏలూరు నగరంలోనే 15 వేలకు పైగా ఆటోలు ఉంటే, మోటారు సైకిళ్లకు లెక్కేలేదు. దెందులూరు, పెదవేగి, పెదపాడు, కై కలూరు, భీమడోలు ఇలా ఆయా మండలాల నుంచి నగరానికి భారీగా జనం వాహనాలపై వస్తూ, వెళుతూ ఉంటారు. కూరగాయల మార్కెట్ కూడలి, మాంసం దుకాణాల వద్ద, టీ, టిఫిన్ సెంటర్లు, హోటల్స్, రెస్టారెంట్లు, స్టేట్ బ్యాంక్ ఏరియా, ఆర్ఆర్‌పేట మార్కెట్, పత్తేబాద రోడ్డు, ఫైర్‌స్టేషన్ సెంటర్, ఎన్ఆర్‌పేట, వన్‌టౌన్‌లోని మార్కెట్ ఏరియా, వస్త్రదుకాణాలు, గడియార స్తంభం ప్రాంతం ఇలా అనేక ప్రాంతాల్లో భారీగా వాహనాలతో రద్దీగా మారిపోతుంటాయి. ఆయా ప్రాంతాల్లో ఎక్కడా పార్కింగ్ స్థలాలు లేక మోటారు సైకిల్, కార్ల వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారు.



టూటౌన్‌లో ట్రాఫిక్ కష్టాలు

ఆంక్షలతో బెంబేలు

ట్రాఫిక్ క్రమబద్ధీకరణ పేరుతో వాహనాలు రోడ్డుపై నిలుపకూడదని పోలీసులు గట్టిగా హెచ్చరిస్తుండడంతో పాటు కొన్ని సందర్భాల్లో వాహనాలకు జరిమానా కూడా విధిస్తున్నారు. సాయంత్రం వేళ ఎన్ఆర్‌పేట, ఫైర్‌స్టేషన్ సెంటర్, కోర్టు సెంటర్, పత్తేబాద, సత్రంపాడు రోడ్లపై వెళ్లాలంటే వాహనదారులు బెంబేలెత్తిపోతున్నారు. రోడ్లపై మోటారు సైకిళ్లు నిలుపుదల చేసేందుకు స్థలం లేక ఇబ్బందులు తప్పటంలేదు. మరోవైపు ట్రాఫిక్ పోలీసులు రద్దీని క్రమబద్ధీకరించేందుకు వాహనాలను స్టేషన్లకు తరలించటంతో వాహనదారులు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు.



ఆర్ఆర్‌పేటలో రోడ్డుపైనే వాహనాల పార్కింగ్

నగరంలో తీవ్రంగా పార్కింగ్ సమస్య

నగరంలోని ఫైర్‌స్టేషన్ సెంటర్, పాతబస్టాండ్, ఆర్ఆర్‌పేట, ఎన్ఆర్ పేట, కొత్తబస్టాండ్, వన్‌టౌన్ ప్రాంతాల్లో పార్కింగ్ స్థలాలను ఏర్పాటు చేయాల్సింది. నగరంలో ఎక్కడా పార్కింగ్ స్థలాలు లేవు. మరోవైపు ఆటోస్టాండ్లకు కూడా అనువైన స్థలాలు లేక ఆటోలను రోడ్లపైనే నిలుపుతున్నారు. ప్రతిరోజూ ఉదయం 8 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట, తిరిగి సాయంత్రం 5 గంటల నుంచి సుమారు 8 గంటల వరకు నగరంలో ట్రాఫిక్ సమస్య వేధిస్తోంది.

నిబంధనలపై అవగాహన కల్పిస్తున్నాం



ఏలూరు నగరంలో ట్రాఫిక్ సమస్య పరిష్కారానికి చర్యలు చేపడుతున్నాం. విద్యార్థులు స్కూల్స్, కాలేజీలకు వెళ్లే సమయం, తిరిగి ఇళ్లకు వెళ్లే సమయంలో ట్రాఫిక్ సమస్య ఏర్పడకుండా పటిష్టమైన చర్యలు తీసుకుంటున్నాం. ఆయా ప్రాంతాల్లో ట్రాఫిక్ పోలీస్‌తోపాటు, ఏలూరు త్రీటౌన్, టూటౌన్ పోలీసులతో ట్రాఫిక్ క్రమబద్ధీకరిస్తూ ప్రజలకు ఇబ్బంది లేకుండా శ్రద్ధ తీసుకుంటున్నాం. షాపులు, దుకాణాల వద్ద రోడ్లపైనే మోటారు సైకిళ్లు, వాహనాలు నిలుపుదల చేస్తూ ఉండడంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. ముందుగా ట్రాఫిక్ నిబంధనలపైనా ప్రజలకు అవగాహన కల్పిస్తున్నాం.

– ఎస్.లక్ష్మణరావు, ఏలూరు ట్రాఫిక్ సీఐ

బాస్కెట్‌బాల్ జాతీయ పోటీలకు ఏలూరు బాలిక



ఏలూరు రూరల్ : జాతీయ స్థాయి బాస్కెట్‌బాల్ పోటీలకు ఏలూరు కస్తూరిబా బాలికల పాఠశాల విద్యార్థిని ఎం యోగశ్రీ ఎంపికైందని హెచ్ఎం జి.సునీత ఒక ప్రకటనలో తెలిపారు. ఇటీవల పల్నాడు జిల్లా నరసరావుపేటలో జరిగిన రాష్ట్ర స్థాయి పోటీల్లో ప్రతిభ చాటిన యోగశ్రీ ఎంపికైందని పేర్కొన్నారు. ఈ నెల 18 నుంచి చత్తీస్‌ఘడ్‌లో అండర్–14 ఎస్‌జీఎఫ్ జాతీయ స్థాయి బాస్కెట్‌బాల్ పోటీలు నిర్వహించనున్నట్టు తెలిపారు. క్రీడాకారిణితో పాటు పీఈటీని హెచ్ఎం అభినందించారు.

ప్రార్థన, ధ్యానంతో సమాజానికి శాంతి



ధ్యాన మందిరాన్ని ప్రారంభిస్తున్న బిషప్ జయరావు

ఏలూరు (ఆర్ఆర్‌పేట) : బిజీగా ఉన్న నేటి సమాజానికి ధ్యానం ఎంతో అవసరమని, ప్రార్ధన, ధ్యానం మనిషి జీవితానికి ప్రశాంతతనిస్తుందని ఏలూరు పీఠాధిపతి బిషప్ జయరావు పొలిమేర అన్నారు. స్థానిక గ్జేవియర్ నగర్‌లోని అమలోద్భవి కెథడ్రల్ చర్చి ఆవరణలో కెథడ్రల్ విచారణ గురువు ఫాదర్ ఇంజమాల మైఖేల్ ఆధ్వర్యంలో నిర్మించిన దివ్య సత్ప్రసాద ధ్యాన మందిరాన్ని ఆయన ప్రారంభించారు. మనిషి ఆరోగ్యంగా ఉండడానికి, సంతోషంగా పని చేయడానికి, ధర్మం ప్రకారం జీవిస్తూ సమాజానికి సేవ చేయడానికి ధ్యానం దోహదపడుతుందని వివరించారు. కార్యక్రమంలో ఫాదర్లు బి.బాల, జి.మోజెస్, టి.ఇమ్మానియేలు, బి.రాజు, బాబు జార్జి, డి.అబ్రహాం, కార్పొరేటర్ ఎం నిర్మల, జె.బెనర్జీ, సిస్టర్లు, సంఘస్తులు పాల్గొన్నారు.

కళలకు కాణాచి హేలాపురి

ఏలూరు (ఆర్ఆర్‌పేట): హేలాపురి అంటే కళలకు కాణాచి అని, ఈ ప్రాంతం కళాకారులకు, కళా పోషకులకు, కళా ప్రోత్సాహకులకు కొదవలేని ప్రాంతంగా హేలాపురికి అంతర్జాతీయ స్థాయిలో పేరుందని అవనిగడ్డ ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్ అన్నారు. కళాపోషకుడు సారిపల్లి కొండల రావు సహస్ర పూర్ణ చంద్ర దర్శనం సందర్భంగా స్థానిక వైఎంహెచ్ఏ హాలులో హైదరాబాద్‌కు చెందిన యువ కళావాహిని సంస్థ ఆధ్వర్యంలో నగరానికి చెందిన హేలాపురి కళాకారుల సంక్షేమ సంఘం, గరికపాటి ఆర్ట్స్ సంస్థల సహకారంతో కళాకారులకు నిర్వహించిన ఆత్మీయ సత్కార కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. ఈ ప్రాంతం నుంచి ఎంతో మంది కళాకారులు అంతర్జాతీయ స్థాయికి ఎదిగి ఏలూరుతో పాటు రాష్ట్రానికి, దేశానికి కీర్తిప్రతిష్టలు తీసుకొచ్చారని కొనియాడారు. ఈ సందర్భంగా జానపద కళాకారుడు మిరియాల శేఖర్ బాబు, రంగస్థల, టీవీ, సినీ నటుడు పి.విజయకుమార్, మరికథా భాగవతారిణి సప్పా భారతిలను సత్కరించారు. కార్యక్రమంలో యువ కళావాహిని అధ్యక్షుడు లంక లక్ష్మీ నారాయణ, జిల్లా రిజిస్ట్రార్ లంకా వెంకటేశ్వర్లు, సినీ విజ్ఞాన విశారద ఎస్‌వీ రామారావు, ఏపీబీఎస్ఎస్ఎస్ రాష్ట్ర అధ్యక్షుడు సత్యవాడ దుర్గాప్రసాద్, బీఎస్ఎన్ఎల్ విశ్రాంత ఇంజినీర్ వీవీవీ హనుమంత రావు పాల్గొన్నారు. కార్యక్రమాన్ని యువకళా వాహిని ఉపాధ్యక్షుడు ఎంఏ హమీద్, హేలాపురి కళాకారుల సంక్షేమ సంఘం అధ్యక్షుడు పెదపాటి రామకృష్ణ, గరికపాటి ఆర్ట్స్ థియేటర్ డైరెక్టర్ గరికపాటి కాళిదాసు పర్యవేక్షించారు.



కళాకారులను సత్కరిస్తున్న అతిథులు

18న అంతర్జాతీయ విద్యా ప్రదర్శన

ఏలూరు (ఆర్ఆర్‌పేట) : స్థానిక రామచంద్ర ఇంజినీరింగ్ కళాశాల ఆవరణలో ఈనెల 18న రామచంద్ర ఇంజినీరింగ్ కళాశాల, లియో గ్లోబల్ ఓవర్సీస్ సంయుక్త ఆధ్వర్యంలో అంతర్జాతీయ విద్యా ప్రదర్శన ఏర్పాటు చేయనున్నట్టు కళాశాల ప్రిన్సిపాల్ డి.మురళీధరరావు తెలిపారు. శనివారం కళాశాలలో లియో గ్లోబల్ ఓవర్సీస్ ప్రతినిధులతో కలిసి ఆయన విలేకర్లతో మాట్లాడారు. ప్రపంచవ్యాప్తంగా అమెరికా, బ్రిటన్, కెనడా, ఆస్ట్రేలియా వంటి దేశాల్లో ఉన్న 25 ప్రముఖ విశ్వవిద్యాలయాల ప్రతినిధులు ఈ ప్రదర్శనలో పాల్గొంటారని చెప్పారు. వీరంతా భవిష్యత్తులో డిమాండ్ ఉన్న కోర్సులు, వాటికి అర్హతలు, విద్యార్థులకు అందే స్కాలర్‌షిప్ వంటి అంశాలను వివరిస్తారని తెలిపారు. లియో గ్లోబల్ ఓవర్సీస్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ కె.ప్రసన్నలక్ష్మి మాట్లాడుతూ విదేశాల్లో విద్యాభ్యాసం చేయాలని కలలు కనే విద్యార్థులకు ఇది చక్కటి అవకాశమని, విద్యార్థుల తల్లిదండ్రులు కూడా ప్రదర్శనలో పాల్గొని మంచి నిర్ణయం తీసుకోవాలని కోరారు. సమావేశంలో రామచంద్ర ఇంజినీరింగ్ కళాశాల డీన్ ఎస్ సుబ్రహ్మణ్య శర్మ, లియో గ్లోబల్ ఓవర్సీస్ సంస్థ క్లైంట్ రిలేషన్‌షిప్ మేనేజర్ జి.అబ్బయ్య చౌదరి, గుంటూరు జిల్లా శాఖ మేనేజర్ అనూహ్య నర్రా పాల్గొన్నారు.



మాట్లాడుతున్న కళాశాల ప్రిన్సిపాల్ మురళీధరరావు

జీతాలు చెల్లించాలని క్లాప్ ఆటో డ్రైవర్ల ధర్నా

ఏలూరు (టూటౌన్): బకాయి జీతాలు వెంటనే చెల్లించాలని కోరుతూ శనివారం స్థానిక వంగాయగూడెంలోని నగరపాలక సంస్థ వెహికల్ డిపో వద్ద క్లాప్ (క్లీన్ ఆంధ్రప్రదేశ్) ఆటోల డ్రైవర్లు ధర్నా చేశారు. తమకు బకాయి జీతాలు చెల్లించాలని, సమ్మె వేతనాలు చెల్లించాలని, పాడైపోయిన బండ్లు రిపేర్ చేయించాలని, పీఎఫ్, ఈఎస్ఐలు ఖాతాలో జమ చేయాలని నినదించారు. కార్యక్రమంలో యూనియన్ నాయకులు రాజు, పుష్పరాజులు మాట్లాడారు. జీతాలు సకాలంలో రాక క్లాప్ ఆటోల డ్రైవర్లు అనేక ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. సకాలంలో జీతాలు చెల్లించని పక్షంలో సమ్మెకు దిగుతామని హెచ్చరించారు. ప్రతి నెలా 5వ తేదీలోపు జీతాలు చెల్లించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమానికి రాజు, హరీష్, సుగుణ కుమార్, శ్రీను, పుష్పరాజు తదితరులు నాయకత్వం వహించారు. ధర్నా అనంతరం మున్సిపల్ కమిషనర్ ఎ.భానుప్రతాప్‌కు సమస్యలతో కూడిన వినతిపత్రం అందజేశారు.



నగరపాలక సంస్థ వెహికల్ డిపో వద్ద ధర్నా చేస్తున్న డ్రైవర్లు

రైతాంగ సమస్యలపై 26న మహాధర్నా

ఏలూరు (టూటౌన్): రైతాంగ సమస్యల పరిష్కారం, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు రైతాంగానికి ఇచ్చిన హామీ అమలు కోరుతూ ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం జిల్లా కార్యదర్శి కె.శ్రీనివాస్ డిమాండ్ చేశారు. స్థానిక సీఐటీయూ జిల్లా కార్యాలయంలో ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం ఆధ్వర్యంలో శనివారం రైతుల సమావేశం శనివారం నిర్వహించారు. కె.శ్రీనివాస్ మాట్లాడుతూ రైతులు, కార్మికుల సమస్యలు పరిష్కారం కోసం ఈనెల 26న ఏలూరు కలెక్టరేట్ వద్ద నిర్వహించే మహాధర్నాను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. వ్యవసాయ రంగాన్ని లాభసాటిగా మారుస్తామని ప్రభుత్వాలు చెబుతున్నా, ఆచరణలో వ్యవసాయాన్ని కార్పొరేట్ వ్యవసాయంగా మార్చే విధానాలు అనుసరిస్తున్నారని విమర్శించారు. ఢిల్లీ రైతాంగ ఉద్యమం సందర్భంగా ఇచ్చిన హామీ మేరకు మద్దతు ధరల గ్యారెంటీ చట్టం తీసుకురావాలని కోరారు. కేరళ తరహాలో రైతు రుణ విమోచన చట్టం తీసుకురావాలన్నారు. జిల్లాలో గ్రీన్ ఫీల్డ్ హైవే, చింతలపూడి ఎత్తిపోతల పథకం, ఇతర జాతీయ రహదారుల విస్తరణ, ప్రభుత్వ, ప్రైవేటు అవసరాల రీత్యా చేస్తోన్న భూసేకరణలో రైతులకు న్యాయమైన పరిహారం అందించాలని డిమాండ్ చేశారు. అలాకాకుండా రైతుల నుంచి బలవంతంగా భూములు లాక్కోవడం తగదన్నారు. భూములు ఆన్‌లైన్, పట్టాదారు పాస్ పుస్తకాలు వంటి సమస్యలు పరిష్కరించాలని కోరారు. అప్పులతో ఆత్మహత్య చేసుకున్న రైతు, కౌలు రైతు కుటుంబాలకు ఎక్స్‌గ్రేషియా చెల్లించాలన్నారు. 26న జరిగే కలెక్టరేట్ మహాధర్నా విజయవంతం కోరుతూ జిల్లా వ్యాప్తంగా ప్రచారం చేస్తామని తెలిపారు. సమావేశంలో పి.దావీదు, కె.జగదీష్, బొడ్డు చింతయ్య, పి.డేవిడ్ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా జాతీయ పత్రికా దినోత్సవం

ఏలూరు (ఆర్ఆర్‌పేట): జాతీయ పత్రికా దినోత్సవం సందర్భంగా ఏపీయూడబ్ల్యూజే ఏలూరు జిల్లా కమిటీ, ఎల్రక్టానిక్ మీడియా, సామ్నాల ఆధ్వర్యంలో శనివారం స్థానిక రెవెన్యూ భవన్‌లో సీనియర్ జర్నలిస్టులకు ఘనంగా సన్మానం చేశారు. ఈ సందర్భంగా ఐజేయూ, రాష్ట్ర నాయకులు మాట్లాడుతూ సమాజాభివృద్ధిలో వారధుల్లా జర్నలిస్టులు కీలక పాత్ర పోషిస్తున్నారని చెప్పారు. ప్రెస్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా 1966 నవబర్ 16వ తేదీన ఏర్పాటయిందన్నారు. ఆ రోజును జాతీయ పత్రికా దినోత్సవంగా దేశవ్యాప్తంగా జర్నలిస్టులందరు వ్యవహరిస్తున్నారని వివరించారు. పలు యూనియన్ల నాయకులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

మద్యం తాగి వాహనాలు నడిపితే జరిమానా



అవగాహన కల్పిస్తున్న డీఎస్పీ శ్రావణ్‌కుమార్

ఏలూరు టౌన్ : ఏలూరు నగరంలో మద్యం తాగి వాహనాలు నడిపితే కఠిన చర్యలు తప్పవని, న్యాయస్థానంలో జరిమానాలు విధిస్తారని ఏలూరు ట్రాఫిక్ సీఐ ఎస్ లక్ష్మణరావు హెచ్చరించారు. డీఎస్పీ డి.శ్రావణ్‌కుమార్ పర్యవేక్షణలో వారం రోజులపాటు ట్రాఫిక్ పోలీసులు స్పెషల్ డ్రైవ్ చేపట్టారు. వారం రోజుల్లో 87 కేసులు నమోదవగా, వీటిలో 71 కేసులకు సంబంధించి న్యాయస్థానంలో చార్జిషీట్ దాఖలు చేశారు. ఏలూరు ఫస్ట్ స్పెషల్ జ్యుడిషియల్ సెకెండ్ క్లాస్ మేజిస్ట్రేట్ ముందు హాజరుపరచగా న్యాయమూర్తి 71 కేసులకు రూ.1.48 లక్షల జరిమానా విధించారని ట్రాఫిక్ సీఐ తెలిపారు. ఈ సందర్భంగా ఏలూరు డీఎస్పీ శ్రావణ్‌కుమార్ వాహనదారులు చట్టానికి అనుగుణంగా నడుచుకోవాలని అవగాహన కల్పించారు.

చిన్నారుల ఆరోగ్య పరీక్షలపై ఆరా

ఏలూరు (టూటౌన్): రాష్ట్రీయ బాల స్వస్థ కార్యక్రమం – బాలల సంపూర్ణ ఆరోగ్య రక్ష కార్యక్రమం ప్రారంభం సందర్భంగా శనివారం చాటపర్రు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలోని సత్రంపాడు అంగన్‌వాడీ కేంద్రాన్ని జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి ఎస్ శర్మిష్ట సందర్శించారు. పిల్లలకు నిర్వహించే ఆరోగ్య పరీక్షలపై ఆరా తీశారు. పిల్లల ఆరోగ్య వివరాలను యాప్‌లో నమోదు చేసే విధానాన్ని పర్యవేక్షించారు. సిబ్బందికి పలు సూచనలు చేశారు. కార్యక్రమంలో ఆర్‌బీఎస్‌కే జిల్లా ప్రోగ్రామ్ అధికారి నరేంద్ర కృష్ణ, చాటపర్రు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి కృష్ణ, జిల్లా మేనేజర్ బొప్పన నరేష్, వైద్య, అంగన్‌వాడీ సిబ్బంది పాల్గొన్నారు.



యాప్‌లో ఆరోగ్య వివరాల నమోదును పరిశీలిస్తున్న డీఎంహెచ్ఓ షర్మిష్ట

గ్రంథాలయ పితామహులు, ఉద్యమకారులకు నివాళి

ఏలూరు (ఆర్ఆర్‌పేట): గ్రంథాలయ వారోత్సవాల్లో భాగంగా మూడో రోజు శనివారం స్థానిక జిల్లా కేంద్ర గ్రంథాలయంలో గ్రంథాలయ పితామహులు, గ్రంథాలయ ఉద్యమకారులు ఎస్ఆర్ రంగనాథన్, అయ్యంకి వెంకట రమణయ్య, పాతూరి నాగభూషణం చిత్రపటాలకు ముఖ్య అతిథులుగా వయోజన విద్య అసిస్టెంట్ ప్రాజెక్ట్ ఆఫీసర్ ఆర్ విజయకుమార్, ప్రభుత్వ జూనియర్ కళాశాల లెక్చరర్ జి.రజని పూలమాలలు అలంకరించి నివాళులర్పించారు. జిల్లా గ్రంథాలయ సంస్థ కార్యదర్శి ఎం శేఖర్‌బాబు అధ్యక్షతన టీమ్ ఫర్ గుడ్ గవర్నెన్స్ సంస్థ ఆధ్వర్యంలో సమాచార హక్కు చట్టంపై అవగాహన సదస్సు, చర్చా కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో సంస్థ జనరల్ సెక్రెటరీ ఎస్ గణపతి రాజు, జీవీవీ నరసింహారావు, యూఎస్‌వీ సత్యనారాయణ, అయినాల శ్రీనివాసరావు, అతిథులు బీకేఎస్ అయ్యంగార్, డిప్యూటీ లైబ్రేరియన్ ఎ.నారాయణరావు, కార్యాలయ సిబ్బంది, జిల్లా కేంద్ర గ్రంథాలయ సిబ్బంది, పాఠకులు పాల్గొన్నారు.



గ్రంథాలయ ఉద్యమ పితామహులకు నివాళులర్పిస్తున్న అతిథులు

మద్యానికి డబ్బులు ఇవ్వలేదని ఆత్మహత్య

ఏలూరు టౌన్: మందు తాగేందుకు భార్య డబ్బులు ఇవ్వకపోవటంతో మనస్థాపానికి గురైన భర్త ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఏలూరు వన్‌టౌన్ నాగేంద్ర కాలనీకి చెందిన పి.మాణిక్యరెడ్డి (60)కి భార్య, ఇద్దరు కుమారులు ఉన్నారు. పూటుగా మద్యం తాగే అలవాటు ఉండడంతో మాణిక్యరెడ్డి శనివారం ఉదయమే మందు తాగి ఇంటికొచ్చి భార్యతో గొడవపెట్టుకున్నాడు. తనకు మద్యం చాలలేదని, డబ్బులు ఇవ్వాలని అడిగాడు. భార్య డబ్బులు ఇవ్వకపోవటంతో ఇంటివద్ద చెట్టు ఎక్కి ఉరివేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఘటనా స్థలాన్ని పరిశీలించిన ఏలూరు రూరల్ ఎస్సై సీహెచ్ దుర్గాప్రసాద్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

అద్దె కారు తాకట్టుపై కేసు

ఏలూరు టౌన్: ఏలూరు నగరంలో కారును కిరాయికి తీసుకుని తాకట్టుపెట్టిన వ్యక్తిపై రూరల్ పోలీసులు కేసు నమోదు చేశారు. ఏలూరు బీడీ కాలనీ ద్వారకానగర్ ప్రాంతానికి చెందిన నెరుసు శివకృష్ణ కార్లను అద్దెకు తిప్పుతూ ఉంటాడు. ఏలూరు పుష్పలీలా నగర్ ప్రాంతానికి చెందిన ముంగర అభిషేక్ అనే వ్యక్తి శివకృష్ణకు చెందిన మారుతీ ఎర్టిగా కారును నెలకు కిరాయికి మాట్లాడుకున్నాడు. నెలకు రూ.40 వేలు ఇస్తానంటూ కారును ఈ ఏడాది ఆగస్టు 18న తీసుకువెళ్లాడు. ఎంతకాలమైనా అద్దె చెల్లించకపోగా, కారును వేరొకరికి తాకట్టు పెట్టినట్టు తెలిసింది. బాధితుడి ఫిర్యాదు మేరకు రూరల్ పోలీసులు కేసు దర్యాప్తు చేపట్టారు.

దివ్యాంగులకు సహాయం అందించాలి

ఏలూరు (టూటౌన్): దివ్యాంగులకు ప్రతి ఒక్కరూ సహాయం అందించాలని ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయం రిజిస్ట్రార్ ప్రొఫెసర్ సుధాకర్ కోరారు. శనివారం ఆయన ఏలూరులోని దొండపాడు పరివర్తన్ దివ్యాంగుల పాఠశాలను సందర్శించారు. దివ్యాంగ పిల్లలకు విద్యాబోధన చేయడం చాలా సహనంతో కూడినదన్నారు. పరివర్తన్ సంస్థ గత 16 ఏళ్లుగా 10వ తరగతిలో 100 శాతం ఉత్తీర్ణత సాధించడం అభినందనీయమని అన్నారు. సంస్థకు తనవంతు సహాయ సహకారాలు అందిస్తానని హామీ ఇచ్చారు. పాఠశాల ప్రిన్సిపాల్ డి.శ్రీనివాసరెడ్డి మాట్లాడుతూ బధిర విద్యార్థులకు విద్యాబోధన చాలా కష్టంతో కూడుకున్న పని ఐనా దాన్ని అధిగమించి సమర్థవంతంగా ఎదుర్కొని అభివృద్ధి సాధిస్తున్నట్టు చెప్పారు. కార్యక్రమంలో పాఠశాల సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధి పనులు చేపట్టాం

సాక్షి స్పందన

ఏలూరు రూరల్ : ఏలూరు రూరల్ మండలం కొల్లేరు గ్రామాల్లో పీఎంఏవై 2.0 కొత్త డీపీఆర్ వచ్చిన తర్వాత ప్రభుత్వం లబ్దిదారుల ఇంటి నిర్మాణాలకు రుణాలు మంజూరు చేస్తుందని ఎంపీడీఓ వి.శ్రీలత ఒక ప్రకటనలో పేర్కొన్నారు. శనివారం సాక్షి పత్రికలో ప్రచరితమైన కొల్లేరు గ్రామాల్లో అటకెక్కిన అభివృద్ధి కథనంపై ఆమె స్పందించారు. కోటేశ్వరదుర్గాపురం నుంచి పైడిచింతపాడు వరకు సుమారు 15 కిలో మీటర్లు రహదారి ఇటీవల వచ్చిన వరదలు, వర్షాలకు పాడైందన్నారు. ఈ రోడ్డు మరమ్మతులకు రూ.14 లక్షలతో అంచనాలు రూపొందించి ప్రభుత్వానికి నివేదించామని తెలిపారు. అటవీ శాఖ అధికారుల పర్యవేక్షణలో రెండు రోజుల్లో గుడివాకలంకలో మత్స్యకారులను పిలిపించి, అర్హులందరికీ లైసెన్స్ ఇప్పిస్తామని పేర్కొన్నారు. పలు గ్రామాల్లో అభివృద్ధి పనులు చేపట్టనున్నట్టు తెలిపారు.

కూరగాయల ధరలు

ఏలూరు నగరంలోని రైతు బజార్లలో కూరగాయల ధరలు

కూరగాయలు	కిలో ధర	కూరగాయలు	కిలో ధర
టమాటాలు	30	అరటి కాయ (1)	07–10
వంకాయలు (గులాబీ)	34	చిక్కుడు కాయలు	92
వంకాయలు (కాంతులు)	52	చామదుంపలు	44
వంకాయలు (తెలుపు)	28–48	ములక్కాడలు	07, 10
బెండకాయలు	24	కంద	80
పచ్చిమిర్చి	30–32	బీట్‌రూట్	60
కాకర కాయలు	34	కీరా దోస	26
బీరకాయలు	30	ఫ్రెంచ్‌బీన్స్	72
బీరకాయలు (పందిరి)	34	అల్లం	80
క్యాబేజీ	32–40	కొత్తిమీర (కట్ట)	25
క్యారెట్	60	పాలకూర	12
దొండకాయలు	28	చుక్కకూర	15
బంగాళదుంపలు	38	తోటకూర	12
ఉల్లిపాయలు	38–55	గోంగూర	07
గోరుచిక్కుడు	52	పుదీనా	05
దోసకాయలు	28–36	బఠాణి	--
ఆనబకాయ (1)	25–30	క్యాప్సికమ్	72
పొట్లకాయ(1)	20–25	చిలకడదుంప	44